## వినోభానగర్‌లో పర్యటించిన డిప్యూటీ మేయర్


శ్మశాన వాటికలో సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్‌లో సోమవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. బస్తీ వాసులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా బస్తీ వాసులకు సంబంధించిన శ్మశాన వాటికను పరిశీలించారు. అక్కడికి వచ్చే వారికి కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా స్నానాల గదులు, టాయిలెట్స్, నీటి సదుపాయం కోసం బోర్ వెల్ నిర్మాణం, రోడ్లు, లైట్స్, వృద్దులు కూర్చోవడానికి బెంచీలు తదతర సదుపాయాలు కల్పించాలనీ వినోభానగర్ వాసులు ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్‌ను కోరారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ వైకుంఠధామం అభివృద్ధి చేయడంతో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి కావాల్సిన ప్రతిపాధనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ వెంకటేష్,స్థానికులు ప్రవీన్‌కుమార్, మహేశ్, నర్సింగ్‌రావు, జయావినోద్,కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**


ఎమ్మెల్యే తలసానిని కలిసిన పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

సనత్‌నగర్: ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తూనే ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కరానికి కూడా కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పార్కులో చేపట్టాల్సిన పనులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే చర్యలు చేపట్టేవిధంగా సంబంధిత అధికారులను ఆదేశిస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పార్కు అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చక్రధర్, సభ్యులు కృష్ణారావు, జీకేరావు, నాయకులు వెంకటేషన్ రాజు, సురేష్, వినోద్, గజ్జల శ్రీనివాస్, ముక్కా శ్రీనివాస్, సుధాకర్, వెంకట్ తదితరులు ఉన్నారు.

## ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

**డీసీపీ సురేష్ కుమార్**


సమావేశంలో మాట్లాడుతున్న బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్

సనత్‌నగర్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ సూచించారు. రానున్న గణేష్ చతుర్థిని పురస్కరించుకుని ఎర్రగడ్డ నూర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు, విద్యుత్, ఫైర్ తదితర శాఖల నియమ నిబంధనలను మండపాల నిర్వాహకులు పాటించాలన్నారు. ఆయా శాఖల నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వారు సూచించే గైడ్‌లైన్స్‌ను తప్పకుండా అమలుచేయాలన్నారు. అసాంఘిక శక్తుల కదలికలపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందన్నారు. అడిషనల్ డీసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ వినాయక చవితి ప్రారంభం నుంచి నిమజ్జన ఘట్టం పూర్తయ్యేవరకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొర్వి కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేషన్ చైర్మెన్ జ్ఞానేశ్వర్

బన్సీలాల్‌పేట్: అట్టడుగు వర్గాల అభ్యున్నతి, వికాసానికి నగర మొదటి మేయర్, సంఘ సంస్కర్త కొర్వి కృష్ణస్వామి చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంతి వేడుకలను సోమవారం బోయిగూడ ముదిరాజ్ సంఘంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బుర్రా జ్ఞానేశ్వర్, జగన్మోహన్(రిటైర్డ్ ఐఏఎస్), మురళి, డి. పాండు, కాసాని వీరేష్, ఉత్సవాల కమిటీ కన్వీనర్ దివాకర్ తదితరులు హాజరై మాట్లాడారు. కృష్ణస్వామి ముదిరాజ్ సేవలను గుర్తించి తెలంగాణలోని ఓ విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ జ్ఞానేశ్వర్ చెప్పారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు సదానంద్, సురేందర్, చెన్నయ్య, జగదీష్, వెంకటేశం, శ్రీకాంత్, మన్మోహన్. అంజయ్య, ఎం. శారద తదితరులు పాల్గొన్నారు.

## కులగణన తరువాతే వర్గీకరణ అమలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న ఎస్సీ సంక్షేమ సంఘం సభ్యులు

అడ్డగుట్ట: దళితుల్లో కులగణన చేపట్టిన తరువాతే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సనాధన్ డిమాండ్ చేశారు. సోమవారం తుకారాం గేట్‌లోని మరాఠా బస్తీలో జరిగిన సమావేశంలో సనాధన్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో ఉపకులాలకు అన్యాయం జరిగితే మరో పోరాటం చేస్తామన్నారు. ఎస్సీ ఉపకులాలను మాల, మాదిగ కులాలతో కలపవదన్నారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ సంఘం సభ్యులు మిస్రాకర్, సంజు కాంబ్లె, విజయ్, గోపి, గణేష్, ఉపాధి మహేష్, ఉపాధి రతిలాల్, అక్షయ్, జిట్బాల్, బిజు, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.




## ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌లో మెడల్ సాధించిన సెక్రెటేరియట్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకట్ రెడ్డి

## గేమర్స్ గిల్డ్ గేమింగ్ కేఫ్ ప్రారంభం



బంజారాహిల్స్: హైదరాబాద్‌లో గేమర్స్ గిల్డ్ తన మూడో అతిపెద్ద గేమింగ్ కేఫ్ ప్రారంభించింది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-11లో ఏర్పాటైన ఈ గేమింగ్ కేఫ్‌ను వ్యవస్థాపకుడు బిలాల్ ఆజం, కేఫ్ భాగస్వాములు వినితా సురానా, రంగన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా గేమింగ్ కేఫ్ వివరాలను వెల్లడించారు. బంజారాహిల్స్ నడిబొడ్డున ఉన్న ఈ ఫ్లాగ్‌షిప్ కేఫ్ అన్ని రకాల గేమర్లకు మంచి అనుభూతులను అందించేలా దీనిని రూపొందించినట్లు చెప్పారు. రేసింగ్ అభిమానుల కోసం అత్యాధునిక రేసింగ్ సిమ్యులేటర్‌లతో వీల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే స్పోర్ట్స్, ఎఫ్1, ఫుట్‌బాల్, క్రికెట్ తదితర గేమ్‌లను ఆస్వాదించడానికి కేరాఫ్‌గా ఈ కేఫ్ నిలవనున్నదన్నారు. గేమర్లకు ఉత్సాహభరిత వాతావరణంతో పాటు వారి రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

# ముకుందా..ముకుందా..

సనత్‌నగర్: సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో శ్రీకృష్ణాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారి విద్యార్థులు ఈ సంప్రదాయ దుస్తుల్లో ముచ్చటగొల్పారు. సంగీతానికి లయబద్ధంగా చేసిన నృత్యాలు ఆహుతులను కట్టిపడేశాయి. చిలిపి చేష్టలతో చిన్ని కృష్ణయ్యలు మురిపించారు.. గోపికలతో జతకట్టి నాట్యమాడి మైమరిపించారు.



◆ సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీకృష్ణ భగవానునికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో అర్చకులు తెల్లవారుజాము నుంచే విశేష పూజా కార్యక్రమాలు కొనసాగాయి. పూజల్లో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు.




ఉట్టికొడుతున్న సంజన ప్లే స్కూల్ చిన్నారులు


సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో..



హిందూ పబ్లిక్ స్కూల్‌లో..


సంజన ప్లే స్కూల్‌లో..


బోయిన్‌పల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్


ఓయూలో ఉట్టికొడుతున్న విద్యార్థులు


ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్‌లో ...

## ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్యసేవలందించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హెల్త్ సెంటర్‌లో వైద్యులందరూ పదవీ విరమణ చేసినందున అత్యవసర సమయంలో తార్నాకలోని టీజీ ఆర్టీసీ ఆసుపత్రిలో విద్యార్థులకు, ఉద్యోగులకు ఉచిత వైద్యం అందించాలని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య కోరారు. ఓయూలో ఉండే ఆర్టీసీ ఆసుపత్రి విద్యార్థులకు, ఉద్యోగులకు అతి దగ్గరగా ఉన్నందున ఎమర్జెన్సీ కేసులకు ఉచిత వైద్యం అందించాలని ఆర్టీసీ ఉన్నత అధికారులను కోరారు. ఓయూలో అధికంగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు, కాంట్రాక్టు ఉద్యోగులే ఉన్నారని, చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న వారి కుటుంబాలకు వైద్యం అందిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు.

## బేగంపేట టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిష్టఫర్ రాజ్ మృతి



సనత్‌నగర్: సికింద్రాబాద్ జోన్ బేగంపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిష్టఫర్ రాజ్ సోమవారం మృతి చెందారు. గత కొద్ది కాలంగా లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మరణించారు. వివిధ జిల్లాల్లో మున్సిపల్ ఆఫీసుల్లో పనిచేసిన కిష్టఫర్ రాజ్ గత కొన్నేళ్లుగా బేగంపేట సర్కిల్ ఏసీపీగా విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందారు. ఆయన మృతిపట్ల జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

లిబర్టీ: ప్రైవేటు రంగంలో వెనుకబడిన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. అన్నింటా వెనుకబడి దయనీయల జీవితాన్ని వెళ్లదీస్తున్న బీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పిస్తూ చర్యలు చేపట్టాలని విన్నవించారు. సోమవారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రైవేటు రంగంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.స్వయంగా ప్రధాన మంత్రి బీసీ అయి ఉండి కూడా బీసీలకు ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ దశలవారీగా ప్రైవేటుపరం అవుతున్న తరుణంలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. కేంద్రంలో ప్రాతినిధ్యం వహిస్తున్న బీసీ మంత్రులు, రాజ్యసభ సభ్యులు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు సాధిస్తేనే విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేసే విధంగా అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని విన్నవించారు.

## దేవతా చిత్రాల యాగసమర్పణ


యాగ సమర్పణ చేస్తున్న మాతా సేవా సమితి సభ్యులు

సనత్‌నగర్: ఇంట్లో పూజకు నోచుకోకుండా ఉన్న దేవతామూర్తుల చిత్రపటాలను సనత్‌నగర్‌లోని శ్రీమాతా సేవా సమితి సభ్యులు సేకరించి ఉద్వాసన, విసర్జన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాత చిత్రపటాలతో పాటు విగ్రహాలను యాగ సమర్పణ (అగ్నికి ఆహుతి) చేశారు. సమితి వ్యవస్థాపకులు కుసుమ విజయ, ట్రాన్స్‌కో సహాయ గణాంకాధికారి కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు రాధిక, కృష్ణవేణి, సునీత తదితరులు సనత్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పారవేసిన దేవతా చిత్రాలు, విగ్రహాలు, క్యాలెండర్లు, పూజా సామాగ్రిని సంచుల్లో సేకరించి హనుమాన్ దేవస్థానం ఆవరణలోని రామ్‌లీలా మైదానంలో సోమవారం యాగ సమర్పణ చేశారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు అనుమతితో అర్చకులు కృష్ణశాస్త్రి (నాని), దేవతా చిత్రాల ఉద్వాసన, విసర్జన కోసం శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

## సందడిగా గణనాథుని ఆగమన్ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ సవరాలబస్తీలో భజరంగ్ ఫ్రెండ్స్ అసోషియేషన్ నిర్వాహకుడు పొగర్తి వెంకట్ ఆధ్వర్యంలో గణనాథుని ఆగమన్ వేడుకలు సోమవారం రాత్రి సందడిగా నిర్వహించారు. మూడున్నర లక్షల రూపాయలతో వెంకటేశ్వరస్వామి అవతారంలో ఉన్న గణనాథుని భారీ విగ్రహాన్ని ప్రత్యేకంగా రూపొందించి పార్శిగుట్ట చౌరస్తా నుంచి సవరాలబస్తీ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు తీగుళ్ల రామేశ్వరగౌడ్, పొగర్తి భువన్‌రావు, మహేష్, సాయికృష్ణలతోపాటు స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మదర్ థెరీసాకు ఘన నివాళి



రాంగోపాల్‌పేట్: మదర్ థెరీసా జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రెజిమెంటల్‌బజార్‌లోని మదర్ థెరీసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మదర్ థెరీసా విగ్రహం వద్ద కేక్ కట్ చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబురావు, నందికంటి రవి, శ్రీనివాస్, నాగేష్ యాదవ్ పాల్గొన్నారు.

## ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమీలేయర్ కోసం పాదయాత్ర

పంజగుట్ట: ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమీలేయర్ అమలు చెయ్యడంతోనే దళిత కులాలన్నింటికీ సమన్యాయం జరుగుతుందని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్ధ తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్‌లల్లో క్రిమీలేయర్ విధానం అమలు చెయ్యాలని కోరుతూ సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 10 వరకు ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు దళిత సమన్యాయం పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పాదయాత్ర కరపత్రాన్ని ఆయన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనిమల్ల శంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమీలేయర్‌ను అమలు చెయ్యవద్దని 100కు పైగా సంపన్న ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఎంపీలు ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిసి విజ్ఞప్తి చేశారన్నారు. దళితుల్లో రిజర్వేషన్లు ఏకచక్రాధిపత్యంగా అనుభవించి రాజకీయంగా, సామాజికంగా, ఉద్యోగ పరంగా ఉన్నతస్థానాల్లో ఉన్నవారికి క్రిమీలేయర్‌పై ఎందుకు ఉలికిపాటో అర్థం కావడం లేదన్నారు. క్రిమీలేయర్ విధానాన్ని అడ్డుకునేందుకు యత్నిస్తున్న వారిని ప్రశ్నించేందుకు, దళితులను ఐక్యం చేసి క్రిమీలేయర్ వల్ల కలిగే ఉపయోగాలు వారికి వివరిస్తామని తెలిపారు. ఇప్పటికైనా రిజర్వేషన్లు అనుభవించి దళితుల్లో ఉన్నతస్థాయిలో ఉన్నవారు తమ జాతి బిడ్డల ప్రయోజనానికి, అందరికీ సమన్యాయం జరిగేందుకు క్రిమీలేయర్‌కు సహకరించాలని కోరారు. నాగరాజు, బెజవాడ రవికుమార్, టేకుల ఆదిశేషులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కిలో టమాటా రూ.17, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 23, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 23, పందిరి బీర 28, క్యాబేజీ 15, క్యారెట్ 50, దొండ 18, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 45, గోకరకాయ 23, కీర 28, దోసకాయ 15, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 50, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## ఓయూ భూముల కబ్జాపై హైడ్రా దృష్టి సారించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ భూముల కబ్జా పై హైడ్రా దృష్టి సారించాలని తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ బోయ రమేష్ కోరారు. వర్సిటీ క్యాంపస్‌లోని మోయిన్ చెరువుతో పాటు, హబ్సిగూడ, రవీంద్రనగర్ కాలనీ, మరి కొన్ని ప్రాంతాల్లో ఓయూ భూములు కబ్జాకు గురైన్నట్లు పేర్కొన్నారు. కోర్టు వివాదంలో ఉన్న ఓయూ కబ్జా భూముల పై తుది తీర్పు వెలువడక ముందే కొందరు ప్రవేటు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండ బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపడుతున్నారని ఆయన వివరించారు. ఓయూ అధికారుల మెతక వైఖరి కారణంగా కోర్టు తీర్పులు వెలువడక ముందే కబ్జాదారులు వర్సిటీ స్థలంలో భవనాలను నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. హైడ్రా అధికారులు తక్షణం స్పందించి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని బోయ రమేష్ డిమాండ్ చేశారు.

## అయ్యప్ప ఆలయంలో ఘనంగా పూజలు

రసూల్‌పురా: శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని నగరంలో ప్రసిద్ధి చెందిన బొల్లారం అయ్యప్ప దేవాలయంలో అష్టమి రోహిణి వేడుకలు సోమవారం రాత్రి జరిగాయి. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ఉన్ని కన్నన్ వేషాధారణలో ఉరీ అది (దహీ ఉండి)ని పగులకొట్టడం ఆకర్షణగా నిలిచింది. సికింద్రాబాద్ కళాక్రుట్జ్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన బాల కళాకారులుసంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్, సెక్రటరీ రవినాయర్, కోశాధికారి పద్మభూషణ్ నంబియార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 6న ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ రాష్ట్ర సదస్సు


పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రాన్ని అందిస్తున్న టీపీటీఎల్ఎఫ్ ప్రతినిధులు

సనత్‌నగర్: సెప్టెంబర్ 6న జరిగే ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ రాష్ట్ర సదస్సుకు హాజరుకావాలని రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ సంఘం (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర కమిటీ నాయకులు సోమవారం ఆహ్వానం పలికారు. వచ్చే నెల 6వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరుగుతుందని, ముఖ్యఅతిథిగా హాజరుకావాలని వారు ఆయనను విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు హాజరవుతారని టీపీటీఎల్ఎఫ్ కన్వీనర్ విజయ్‌కుమార్, కొమ్ము విజయ్, లెక్చరర్ సైదులు, టీచర్ విజయ్‌లు ఈ సందర్భంగా తెలిపారు.

## ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు




రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఇస్కాన్‌లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయాన్ని సందర్శించి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భజనలు, ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. దేవాలయం భక్తులతో కిటకిటలాడిపోయింది.

## అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


కాంగ్రెస్‌లో చేరిన నల్లగుట్ట ప్రాంత యువకులతో కోట నీలిమ

సనత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎంతోమంది స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ అన్నారు. నల్లగుట్టకు చెందిన పలువురు నాయకులు సోమవారం ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కోట నీలిమ వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకుసాగుతుందన్నారు. ముక్తార్ అహ్మద్, ఎండీ ఇబ్రహీం, అఫ్సక్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీల్లో మలేరియా పరీక్షలు



లాలాపేట: వర్షాకాలంలో విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం(అర్బన్ హెల్త్ పోస్టు తుకారంగేటు) ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీనగర్‌లోని శ్రీదుర్గా హైస్కూల్ ఆవరణలో ఉచిత అరోగ్య వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. జ్వరాలతో బాధపడుతున్న పలువురికి మలేరియా, డెంగ్యూ పరీక్షలు వంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సరిత, పీహెచ్ఎన్ స్వరూపారాణి, ఏఎన్ఎం హేమలత, దీపిక పాల్గొన్నారు.